క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని ప్రధాన సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 7గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వినోభానగర్, రెడ్డికాలని, అశోక్‌నగర్, ముత్తిరెడ్డికుంట, సుందర్‌నగర్, డాక్టర్స్‌కాలనీ, ఇస్లాంపురం, గాంధీనగర్, షాబునగర్, తాళ్లగడ్డ, విద్యానగర్, బంగారిగడ్డ, సీతారాంపురం, శాంతినగర్‌కాలనీలకు సరఫరా నిలిపివేయనున్నట్లు, అందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

వేములపల్లి : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆరోతరగతి నుంచి పదోతరగతి వరకు గంటల ప్రాతిపదికన హిందీ సబ్జెక్ట్ బోధించడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అయాజ్ ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25వరకు అర్హులైన అభ్యర్థులు ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికెట్ జిరాక్స్‌లతో పాఠశాలలో సంప్రదించాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన విద్యుత్ డిస్కం కమిటీ సభ్యులు

మిర్యాలగూడ : పట్టణంలో విద్యుత్ ఉద్యోగ 1104యూనియన్ మిర్యాలగూడ డివిజన్ కమిటీ సమావేశాన్ని యూనియన్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో యూనియన్ డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా ఎండీ.షఫిఖాన్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎస్‌కె.అహ్మద్, కార్యదర్శిగా గోలి నరేందర్‌రెడ్డి, అదనపు కార్యదర్శిగా డి.మోతీలాల్ ఎన్నికయ్యారు. అనంతరం యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేమారి వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా, వేణు, వెంకన్న, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటయ్య, సాల్మన్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం



నిర్వాహకులను సన్మానిస్తున్న యాదగిరి

నిడమనూరు : మండలంలోని బంకాపురంలో అమ్మనాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసి 47రోజుల పాటు ప్రజలకు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేసిన ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయమని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి అన్నారు. బుధవారం చలివేంద్రం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని నిర్వాహకులను సన్మానించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని వారికి రూ.50వేలు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ పేలపూడి బాలకృష్ణ, సెక్రటరీ గుండంరాజు వెంకటేశ్వరరావు, చిరుమామిళ్ల శ్రీనువాసరావు, పాంపాటి యాదగిరి, నరేష్, రామయ్య, శ్రీనివాస్, మల్లిఖార్జున్, సైదయ్య, సత్యనారాయణ, కుమార్, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులపై దాడులను ఆపాలి



ఎస్టీ కమిషన్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ ఆనంద

మిర్యాలగూడ : దేశంలో గిరిజనులపై జరుగుతున్న దాడులను, హత్యలను, అత్యాచారాలను ఆపాలని సామాజికవేత్త డాక్టర్ ఆనంద్ కోరారు. బుధవారం ఢిల్లీలోని జాతీయ ఎస్టీ కమిషన్ కార్యాలయంలో ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఇటీవల మియాపూర్‌లో 12ఏళ్ల గిరిజన మైనర్ బాలిక అదృశ్యమై శవమై కనిపించిన సంఘటనపై విచారణ జరిపించి దోషులను శిక్షించి, బాలిక కుటుంబ సభ్యులను ఆదుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ ఆధ్వర్యంలో బడిబాట



బడిబాటలో పాల్గొన్న టీచర్లు, చిన్నారులు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి సెక్టార్ పరిధిలో గల దోనియాల అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిప్పర్తి రాధ ఆధ్వర్యంలో బుధవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు సంవత్సరాలు నిండిన, ఐదు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్యకోసం చేర్పించాలని ఆమె కోరారు. అంగన్‌వాడి కేంద్రాల్లో ఇంగ్లిష్ బోధనతో పాటు బుక్స్, యూనిఫాంను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీచర్లు కె.బుచ్చమ్మ, శోభ, ఆర్.మంజుల తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువు తయారీ ఏదీ?

- ఒక్కో షెడ్డుకు సుమారు రూ.2.50లక్షలు ఖర్చు
- కానరాని తడి, పొడి చెత్తసేకరణ
- నిర్వహణ మరిచిన అధికారులు

పెద్దవూర : గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపర్చడంతో పాటు, పర్యావరణ పరిరక్షణకు ముప్పు వాటిల్లకూడదని, గ్రామపంచాయతీలకు అదనపు నిధులు సమకూర్చాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం పల్లెప్రగతిలో భాగంగా సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో సేకరించిన చెత్త నుంచి తడి, పొడి చెత్తలుగా వేరు చేసి సేంద్రియ ఎరువులు తయారు చేయడంతో పాటు మిగతా వ్యర్థాలను డంపింగ్‌యార్డులో వేయాల్సిఉంటుంది. రూ.లక్షలు వెచ్చించి గ్రామాల్లో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ గ్రామపంచాయతీల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఇది ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

లక్షల నిధులు వృథా..

మండలంలో 26 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామపంచాయతీల్లో ఉపాధిహామీ పథకంలో ఒక్కో నిర్మాణానికి సుమారు రూ.2.50లక్షలు వెచ్చించి సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణం చేపట్టారు. కాగా ప్రస్తుతం ఆయా గ్రామాలలో సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. సెగ్రిగేషన్ షెడ్‌లో తడి, పొడి, ప్లాస్టిక్, గాజు, అట్ట, పేపర్ తదితర చెత్తను వేర్వేరుగా నిల్వచేయడానికి ప్రత్యేక అరలు ఏర్పాటు చేశారు. దీంతో పాటు చెత్తను తరలించడా



పెద్దవూరలో నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్డు

నికి ప్రతి జీపీకి ట్రాక్టర్‌ను, నీళ్ల ట్యాంకర్లను కొనుగోలు చేసి అప్పగించింది. తడి, పొడి చెత్త వేరు చేసేందుకు ఇంటింటికీ రెండు రకాల చెత్త బుట్టలు సైతం పంపిణీ చేశారు. తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించకపోవడంతో గ్రామాల్లో ఎరువులు తయారు చేసిన దాఖలాలు లేవు. చాలా జీపీలలో ఒకే స్థలంలో శ్మశానవాటిక, కంపోస్టు షెడ్లు నిర్మించారు. సేంద్రియ ఎరువు తయారు చేసేలా నిర్మించిన కంపోస్టు షెడ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ప్రారంభ దశలో వాటి నిర్వహణపై ఆసక్తి కనబర్చిన అధికార యంత్రాంగం కాలక్రమేణా వాటిని పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి.

తయారు కాని ఎరువు..

పారిశుద్ధ్య సిబ్బంది చెత్త సేకరించే సమయంలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలి. అక్కడ సెగ్రిగేషన్ షెడ్డులో ప్రత్యేకంగా తయారు చేసిన అరలలో తడి, పొడి చెత్తను వేయాలి. తడి చెత్తను దాదాపు 45 రోజుల



షెడ్డులో నిరుపయోగంగా ఉన్న అరలు

పాటు దశలవారీగా సేంద్రియ ఎరువు తయారు చేయాల్సి ఉంటుంది. అయితే క్షేత్ర స్థాయిలో అవేమీ జరగడం లేదు. చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తున్న సిబ్బంది గ్రేడింగ్ చేయకుండా కుప్పలుగా పారబోస్తున్నారు.

డంపింగ్ యార్డులకు తరలని చెత్త..

మండలంలోని పలు గ్రామాల్లో చెత్త డంపింగ్‌యార్డులకు తరలడం లేదు. గ్రామాల్లో వీధుల వెంట చెత్తాచెదారం దర్శనమిస్తుంది. వాటినుంచి దుర్వాసన వస్తుండటంతో ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల మేరకు పంచాయతీ సిబ్బంది ఆ చెత్తను వారం, పది రోజులకు ఒకసారి తీసుకెళ్లి గ్రామశివారులో పడేసి మంట పెడుతున్నారు. దీంతో దారిన వెళ్లే వారికి సమస్యగా మారింది. ఇకనైనా అధికారులు స్పందించి సెగ్రిగేషన్ షెడ్లు, డంపింగ్ యార్డుల నిర్వహణను పూర్తిస్థాయిలో చేపట్టి ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించడంతో పాటు గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

దేవరకొండ : అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని, అర్హులైన ప్రతిఒక్కరూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆయన నివాసంలో చింతపల్లి మండలానికి చెందిన 33మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. కల్యాణలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డల వివాహానికి ఆర్థికంగా భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భవానీపవన్, నాగభూషణం, యాదిగౌడ్, ముచ్చర్ల గిరి, వెంకటయ్యగౌడ్ శ్రీనివాస్, జితేందర్‌రెడ్డి, తదితరులున్నారు.



కల్యాణలక్ష్మి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

తెలంగాణలో విద్యా వ్యవస్థను మెరుగుపరచాలి



సమావేశంలో మాట్లాడుతున్న అభిరామ్

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణలో విద్యా వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు విద్యాశాఖ మంత్రిని నియమించాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి చిల్లంచర్ల అభిరామ్ అన్నారు. బుధవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపులేని పాఠశాలలను తక్షణమే రద్దు చేయాలని, అధిక ఫీజులను వసూలు చేస్తున్న విద్యా సంస్థల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులతో పాటు డీఈఓ, డిప్యూటీ డీఈఓ పోస్టులు, విద్యాశాఖలో ఇతర పోస్టులన్నీ పూర్తి స్థాయిలో భర్తీ చేయాలన్నారు. అర్హులైన పేదలందరికీ కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులకు ఎలాంటి షరతులు లేకుండా రుణాలను మంజూరు చేయాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెదమాం భరత్, పట్టణ ప్రధాన కార్యదర్శి మేడి నవీన్, జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్, దామరచర్ల అధ్యక్షుడు రంగ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్యులు అప్రమత్తంగా వ్యవహరించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నులి పురుగుల నివారణ దినోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. నేడు నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా 1-19 వయస్సులోపు పిల్లలందరికి వైద్యులు, సిబ్బంది ఆల్బెండాజోల్ మాత్రలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కేస రవి, ఎంఈఓ బాలాజీనాయక్, వెంకయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణకు కృషి చేయాలి

వేములపల్లి : నులిపురుగుల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ సుచరిత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎం, ఆశ, అంగన్‌వాడీ టీచర్లకు నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు. నేడు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1-19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆశాలు, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మిర్యాలగూడ : పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

హాలియా మున్సిపల్ వార్షిక బడ్జెట్ రూ.11.24కోట్లు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ

హాలియా : హాలియా మున్సిపాలిటీకి సంబంధించి 2024–25ఆర్థిక సంవత్సరానికిగాను రూ.11.24 కోట్ల వార్షిక బడ్జెట్‌కు మున్సిపల్ పాలకవర్గం ఆమోదం తెలిపినట్లు మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ బుధవారం తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ యడవెల్లి అనుపమానరేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అంచనా బడ్జెట్‌కు పాలకవర్గం ఆమోదం తెలిపినట్లు ఆయన వెల్లడించారు. వాటిలో పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలతో పాటు విలీన గ్రామాల అభివృద్ధి, హరితహారం, శానిటేషన్ కోసం నిధులను ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ బడ్జెట్‌లో ఇంటి పన్నుల ద్వారా రూ.2.40కోట్లు, పన్నుయేతర రాబడి రూ.2.97కోట్లు, ఇతర గ్రాంట్లు కలుపుకుని మొత్తం రూ.5.37కోట్లు రాబడి వస్తుందని అంచనా వేశారు. అలాగే అభివృద్ధి పనులు, జీత భత్యాలు, ఇతర ఖర్చులకుగాను రూ.5.23కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ పిల్లి చంద్రకళఆంజనేయులు, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల మున్సిపల్ ఫ్లోర్‌లీడర్లు చింతల చంద్రారెడ్డి, వర్ర వెంకట్‌రెడ్డి, మేనేజర్ మహమ్మద్ రషీద్, కౌన్సిలర్లు నల్లగొండ సుధాకర్, గౌనీ సుధారాణీరాజారమేష్‌యాదవ్, అన్నెపాక శ్రీనివాస్, నల్లబోతు వెంకటయ్య, తక్కెళ్లపల్లి యల్లమ్మ, ప్రసాద్‌నాయక్, కోఆప్షన్ సభ్యుడు చాపల సైదులు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

గుర్రంపోడు : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిట్టలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.యాదయ్య అన్నారు. బుధవారం మండలంలోని పిట్టలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బడిబాట ముగింపు సందర్భంగా నూతనంగా చేరిన ఆరోతరగతి విద్యార్థులకు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పిట్టలగూడెం కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల హెచ్‌ఎంలు ఐదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులను ప్రైవేట్ స్కూల్స్ వైపు వెళ్లకుండా ప్రత్యేక చొరవ తీసుకుని ఉన్నత పాఠశాలలో చేర్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆయా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలు మరెడ్డి శ్రీరాంరెడ్డి, మల్లికార్జున్, కేసాని జయప్రకాశ్‌రెడ్డి, పర్విన్‌సుల్తానా, నర్సింహ, పాఠశాల ఉపాధ్యాయులు గీత, మంజుల, యాదగిరిరెడ్డి, శేఖర్, వీరస్వామి, రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గుర్రంపోడు : విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం

పాఠశాలలో పుస్తకాల పంపిణీ

నాగార్జునసాగర్ : నందికొండ పైలాన్‌కాలనీలోని ప్రభుత్వ ఆదర్శ ఉన్నత పాఠశాలలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందిస్తారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చదివించాలని కాలనీవాసులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శేషు, కౌన్సిలర్లు రమేశ్‌జీ తదితరులు పాల్గొన్నారు.



నాగార్జునసాగర్ : పుస్తకాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

'నీట్' తిరిగి నిర్వహించాలని సంతకాల సేకరణ

మిర్యాలగూడ : నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ విషయంలో బాధ్యులను వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిప్రసాద్ అన్నారు. 'నీట్' తిరిగి నిర్వహించాలని కోరుతూ బుధవారం పట్టణంలో విద్యార్థుల చేత సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మెడికల్ సీట్ల కోసం నిర్వహించే నీట్ పరీక్షను కేంద్రం పకడ్బందీగా నిర్వహించకపోవడంతో ప్రశ్నాపత్రం లీక్ అయ్యిందని, దీంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షను తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరీఫ్, నియోజకవర్గ అధ్యక్షుడు చందాల ప్రశాంత్, సంజీవ్ పాల్గొన్నారు.



సంతకాలు సేకరణలో పాల్గొన్న ఎన్ఎస్‌యూఐ నాయకులు, విద్యార్థులు

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

దేవరకొండ : పట్టణంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు బుధవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ద్వారా ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమైందన్నారు. అనంతరం పట్టణంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్, దూదిపాళ్ల వేణుధర్‌రెడ్డి, ఎండీ యూనూస్, నాయిని మాధవరెడ్డి, వెంకటేష్‌గౌడ్, పవన్‌కుమార్, సైదులు, కిన్నెర హరికృష్ణ, జయప్రకాష్, కొర్ర రాంసింగ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

త్రిపురారం : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అనుముల పాండమ్మ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి, అనుముల శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధనావత్ భాస్కర్‌నాయక్, బిట్టు రవికుమార్, నిడమనూరు మార్కెట్ మాజీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, అనుముల వెంకట్‌రెడ్డి, అలంపల్లి జానయ్య, భారత్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు పీబీ రవి, సలికంటి బాలకృష్ణ, పీబీ శ్రీనివాస్, అమరేందర్‌రెడ్డి, రామచంద్రయ్య, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డిండి : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ఎంపీ రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రాజీవ్‌గాంధీ చౌరస్తా వద్ద కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దినేష్, వెంకటేష్, రాములు, భీముడు, వెంకటయ్య, లక్ష్మణ్, మల్లేష్, ఖలీం, ఖయ్యూం, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండ : రాహుల్‌గాంధీ జన్మదిన కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం

హాలియా : రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిగా చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు పనిచేయాలని అనుముల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం అనుముల మండల పార్టీ ఆధ్వర్యంలో హాలియా పట్టణంలోని ప్రధాన సెంటర్‌లో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి కేక్‌కట్ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ యడవెల్లి అనుపమా నరేందర్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చింతల చంద్రారెడ్డి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.




హాలియాలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి, కై సర్‌ఖాన్, కుంభం శ్రీనివాస్‌గౌడ్, రవినాయక్, లాలునాయక్, యేకుల సురేష్, భాస్కర్, బద్దునాయక్, కొడిదాల వెంకటయ్య, పాండు, పెద్దిశెట్టి సుధాకర్ పాల్గొన్నారు.

వేములపల్లి : ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలోని నియామత్‌ఖాన్ చెరువులో రైతులతో కలిసి పార్టీ మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గంజి శ్రీనివాస్, బొంగర్ల వినోద్, పుట్టల గురవయ్య, రాజు, గిరి, వెంకన్న, సజ్జు, వరుణ్‌రెడ్డి, సైదులు, సతీష్ పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల ఆందోళన

త్రిపురారం : విద్యాశాఖలో చేపడుతున్న పదోన్నతుల్లో అసంబద్ధ విధానాన్ని తొలగించాలని, ఒక్కరికి ఒక్క పదోన్నతి మాత్రమే అమలు చేయాలని, ఖాళీలు లేకుండా భర్తీ చేయాలని బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ నాయక్ కోరారు. పదోన్నతులపై అవలంభిస్తున్న విధానానికి వ్యతిరేకంగా మండలంలోని చెన్నాయిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలసి ఆయన బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో చెన్నాయిపాలెం హెచ్‌ఎం ఉమ్మడి సైదిరెడ్డి, ఉపాధ్యాయులు సత్యనారాయణ, మంక్లా నాయక్, నరసింహస్వామి, శ్రీదేవి, శ్రీనివాస్, దుర్గామల్లేశ్వరి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శంకరనాయక్, సజాత, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేష్

హాలియా : ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించడంతో పాటు ప్రభుత్వ నిబంధనలను పాటించని విద్యా సంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి విచ్చలవిడిగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నారని, పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు అమ్ముతున్నారని, పర్మిషన్ లేని పాఠశాలల్లో సీబీఎస్ సిలబస్ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, కోరే రమేష్, చందు, యశ్వంత్ తదితరులు ఉన్నారు.

అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

త్రిపురారం : మండల, గ్రామస్థాయిలో అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదని మండల ప్రత్యేక అధికారి, డిప్యూటీ సీఈఓ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పలు శాఖ మండల అధికారులు, గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజావాణి ద్వార మండల కేంద్రంలోని ప్రజల నుంచి వినతులను స్వీకరించి 15రోజుల్లోగా పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయకుమారి, ఇన్‌చార్జ్ ఎంపీఓ రాజేంద్రకుమార్, వ్యవసాయ అధికారి పార్వతీచౌహాన్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో నేటి నుంచి ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నేటి నుంచి ప్రతి రోజు ఉదయం 8:30 నుంచి సాయంత్రం 5:30గంటల వరకు గ్రీవెన్స్‌డే ఉంటుందన్నారు. అదే విధంగా ప్రతి సోమవారం ప్రజావాణి ఉంటుందన్నారు. సమావేశంలో మున్సిపల్ డీఈ వెంకన్న, టీపీఓ సోమయ్య, ఆర్‌ఓ కళ్యాణి, జేఏఓ ధనుంజయ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, టీఎంసీ పాతెపాక బక్కయ్య, పర్యావరణ ఇంజనీరు శ్వేతారెడ్డి, హెల్త్ అసిస్టెంట్ అజ్మీర కిరణ్, జూనియర్ అసిస్టెంట్ దయాకర్‌రెడ్డి ఉన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

కొండమల్లేపల్లి : గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి మండల కేంద్రంలో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతి సోమవారం నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేక అధికారి ఎస్.ద్వారక్, ఎంపీడీఓ రాంరెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక అధికారి ఎస్.ద్వారక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

చందంపేట : మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజల సమస్యల పరిష్కారానికి ఈనెల 24 నుంచి ప్రతి సోమవారం మండల కేంద్రంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మి తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమెతో పాటు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎంపీకి వినతి

మిర్యాలగూడ టౌన్ : రిటైర్డ్ సీపీఎస్ ఉద్యోగులు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు ఫ్యామిలీ పెన్షన్ వర్తించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం తక్షణమే ఫ్యామిలీ పెన్షన్ జీఓ 58ను సవరించాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగవెల్లి ఉపేందర్ అన్నారు. ఈ సందర్భంగా నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డిని బుధవారం పట్టణంలో కలిసి వినతిపత్రం అందజేశారు.

పెయింటింగ్ పరిశీలన

నిడమనూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో దాతల విరాళాలతో ప్రహరీకి, స్కూల్ భవనాల గోడలకు ఆలోచించే, ఆకర్షించే విధంగా పెయింటింగ్ వేయించారు. ఈ సందర్భంగా పాఠశాలను ఎంఈఓ బాలునాయక్ బుధవారం సందర్శించి పాఠశాలలో వేసిన పేయింటింగ్‌ను పరిశీలించారు. అనంతరం హెచ్‌ఎం కర్నాటి శ్రీనుకుమార్‌ను అభినందించడంతో పాటు విరాళాలు అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని మేడారం గ్రామానికి చెందిన గ్యార వెంకటమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలు నిరుపేద కావడంతో బుధవారం గ్రామస్తులు జమచేసి రూ.80వేల ఆర్థికసాయాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. వారిలో గ్రామస్తులు శ్రీనివాస్‌యాదవ్, అంజి, నక్క సైదులు, ఎల్గూరి భాస్కర్‌రెడ్డి, హనుమారెడ్డి, రమేష్, అనిల్ తదితరులున్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

త్రిపురారం : మండల కేంద్రంలోని అడవిదేవులపల్లి రోడ్డులో గల శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలో బుధవారం గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణాన్ని పండితుల వేద మంత్రోచ్చరణాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లయ్యస్వామి, పులిజాల విష్ణు, మట్టయ్య పాల్గొన్నారు.